

అలరించిన శోభాయాత్రలు

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా అమ్మవారి విగ్రహాల ఊరేగింపు
- డప్పు, మేళతాళాలతో నిమజ్జనానికి తీసుకెళ్లిన భక్తులు
- నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఆధ్యాత్మిక శోభ 7



నారాయణపేటలో సాగు చేసిన వరి పంట

బోనస్ కోసం.. ఎదురు చూపులు



- నారాయణపేట జిల్లాలో రైతులకు ఇవ్వాల్సినవి రూ.70.49 లక్షలు
- ఇవ్వకుంటే ఎన్నికల బరిలో నిలుస్తామన్న రైతాంగం
- కేబినెట్‌లో చర్చించి ఇప్పిస్తానన్న మంత్రి వాకిటి శ్రీహరి

నారాయణపేట, అక్టోబరు 4, (ఆంధ్రజ్యోతి): గత రబీలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న రకం ధాన్యానికి బోనస్ ఎప్పుడొస్తుందా? అని రైతులు ఎదురు చూస్తున్నారు. క్వింటాలుపై రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ డబ్బులు ఇంకా చెల్లించలేదు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా గత రబీలో 100 కొనుగోలు కేంద్రాల ద్వారా 198283.04 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో క్రాస్ రకం ధాన్యం 57299.720 మెట్రిక్ టన్నులు కాగా, సన్న రకం ధాన్యం 140983.320 మెట్రిక్ టన్నులు కొన్నారు. 29,360 మంది రైతుల నుంచి ఆ ధాన్యాన్ని సేకరించారు. మద్దతు ధరగా రూ.46,16,653 రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. బోనస్ డబ్బులు 19,321 మంది రైతులకు రూ.70,49,000 ఇవ్వాల్సి ఉంది.

రైతులతో మంత్రి సమావేశం

బోనస్ డబ్బులు చెల్లించకపోతే రాబోయే స్థానిక సంస్థాగత ఎన్నికల్లో పోటీ చేస్తామని శుక్రవారం టైరోడ్‌లో జరిగిన రైతు సమావేశంలో రైతులు పేర్కొన్నారు. వెంటనే స్పందించిన మంత్రి వాకిటి శ్రీహరి అదే రోజు మక్తల్‌లో బోనస్ డబ్బుల గురించి రైతులతో చర్చలు జరిపారు. బోనస్ విషయమై కేబినెట్‌లో చర్చించి, ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ మేనేజర్ సైదులును 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా ప్రభుత్వానికి నివేదికలు పంపించామని, త్వరలోనే రైతులకు చెల్లించడం జరుగుతుందని అన్నారు.

ఇప్పుడెలా..

జడ్పీ పీఠం రేసులో ఉన్నవారికి శరాఘాతంగా మారిన రిజర్వేషన్లు



మహబూబ్‌నగర్ జడ్పీ కార్యాలయం

- ఉమ్మడి పాలమూరులో నాలుగు స్థానాలు మహిళలకే కేటాయింపు
- జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచు స్థానాల విషయంలోనూ అదే పరిస్థితి
- మంత్రులు, ఎమ్మెల్యేలపై గుర్రుగా ఉన్న ద్వితీయ శ్రేణి హస్తం నాయకులు
- బీఆర్ఎస్‌లోనూ అలజడి రేపుతున్న స్థానిక సంస్థల రిజర్వేషన్లు
- తప్పిన లెక్కలు.. ఎన్నికలు జరిగితే కొత్త ముఖాలు రాజకీయ తెరపైకి..







మహబూబ్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం చేసిన రిజర్వేషన్లు ఇంతకాలం పార్టీలను నమ్ముకుని కొనసాగిన రెండో కేడర్ నాయకులకు శరాఘాతంగా మారాయి. ప్రధానంగా అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కీలక నాయకులకు జులక్ ఇస్తూ.. వారి సామాజిక వర్గానికి కాకుండా మరో సామాజిక వర్గానికి రిజర్వ్ చేయడంతో వారు అనుకున్న స్థానాలకు పోటీ చేయలేకపోతున్నారు. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో చాలాకాలంగా క్రియాశీలక పాత్ర పోషించి.. పార్టీ విజయానికి అహర్నిషలు పనిచేసిన వారికి రిజర్వేషన్లు మొండిచేయి చూపించాయని చెప్పవచ్చు. సీఎం నియోజకవర్గమైన కొడంగల్ మొదలుకుని మంత్రుల నియోజకవర్గాలైన కొల్లాపూర్, మక్తల్, ఇతర ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కూడా చాలామందికి రిజర్వేషన్లు చేదు అనుభవాన్ని మిగిల్చేవిగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాన్నాళ్లుగా ఆయా స్థానాల్లో పోటీ చేయాలని ఆశించి.. రిజర్వేషన్ల కారణంగా అర్హత కోల్పోతున్న వారిలో తీవ్ర ఆవేదన నెలకొంది. కక్క లేక మింగలేక అన్నట్లుగా మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద వారి ఆవేదన వెలిబుచ్చుతున్నారు. బీఆర్ఎస్‌లోనూ ఇంచుమించుగా

(మిగతా 6లో..)

రిక్తహస్తం..

పదేళ్లు అధికారంలో లేకపోయినా పార్టీ కోసం శ్రమించిన నాయకులు.. ఇప్పుడు అధికారంలోకి రావడంతో పక్కాగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లేదా ఎంపీపీ లేదా జడ్పీటీసీ.. అవి కాకున్నా కనీసం సర్పంచు, ఎంపీటీసీ అయినా కావడం గ్యారెంటీ అని ఇన్నాళ్లు కాంగ్రెస్ నాయకులు కలలు కన్నారు. ఎంతో ఆశతో ఉన్న అలాంటి రెండో కేడర్ తలపై పిడుగుపడింది. వారు కలలు కన్న పదవులన్నీ రిజర్వేషన్లలో వేరే సామాజిక వర్గాలకు రిజర్వ్ కావడంతో వారి ఆశలు గల్లంతయ్యాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాల్లో ఎవరికీ న్యాయం జరుగలేదని ఆందోళన వ్యక్తమవుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి, వాకిటి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇలా అందరి నియోజకవర్గాల్లో కష్టపడ్డ సెకండ్ కేడర్‌కు 90 శాతం వరకు స్థానిక ఎన్నికల్లో అవకాశం లేకుండా పోయింది. ఐదు జిల్లా పరిషత్‌లు, 77 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు, 1,678 పైచిలుకు సర్పంచు స్థానాలు, 800 ఎంపీటీసీ స్థానాల్లో ఎక్కడా రెండు, మూడో కేడర్ నాయకులు సంతృప్తిగా లేరంటే వారిపై ప్రస్తుత రిజర్వేషన్ల ప్రభావం ఎంత పడిందో అర్థం చేసుకోవచ్చు.

మందుకొడిగా..



- మద్యం దుకాణాలకు 9 రోజుల్లో 7 దరఖాస్తులే..
- ఉమ్మడి జిల్లాలో 227 మద్యం షాపులు 6
- టెండర్లపై ఎన్నికల ఎఫెక్ట్..! ● ఈనెల 18 వరకు గడువు

స్థానిక సంస్థల ఎన్నికలకు గుర్తులు ఖరారు



గుడిమల్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

- 35 గుర్తులు కేటాయించిన రాష్ట్ర ఎన్నికల సంఘం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న జిల్లా, మండల ప్రాదేశిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు 35 గుర్తులను కేటాయించింది. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం ద్వారా గుర్తింపు పొందినవి కాకుండా జాతీయ స్థాయిలో ఎన్నికల సంఘం కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయ్యి, గుర్తింపు పొందక, గుర్తులు లేని పార్టీలు 69 ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం పార్టీల బీ ఫారమ్‌తో కాకుండా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేసే వారి కోసం 35 గుర్తులను ఎంపిక చేసింది. ఈ ఎన్నికల్లో స్వతంత్రులుగా పోటీచేసే ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు వాటిని కేటాయించనున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థికి ఒకే గుర్తు కూడా కేటాయించే అవకాశం ఉంది. ఎంపీటీసీ ఎన్నికల బ్యాలెట్ పేపర్ గూలాబీ రంగులో, జడ్పీటీసీ బ్యాలెట్ పేపర్ తెలుపు రంగులో ఏర్పాటు చేశారు. జిల్లాలోని 16 మండలాలకు గాను 16 జడ్పీటీసీ, 175 ఎంపీటీసీ స్థానాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది.

కేటాయించిన గుర్తులు ఇవే..

1.ఎయిర్ కండిషనర్, 2.ఆపిల్, 3.పండ్ల బుట్ట, 4.బ్యాటరీ టార్చ్, 5.బెల్ట్, 6.బైనాక్యూలర్, 7.కెమరా, 8.క్యారమ్ బోర్డు, 9.చపాతి రోలర్, 10.కోటు, 11.ఫుట్‌బాల్ ఆటగాడు, 12.గిఫ్ట్‌ప్యాక్, 13.గ్రామ్‌ఫోన్, 14.ద్రాక్ష పండ్లు, 15.పచ్చి మిరపకాయ, 16.హార్మోనియం, 17.పనస పండు, 18.అగ్గిపెట్టె, 19.మైక్, 20.పౌరులు, 21.మూకుడు, 22.పియర్స్, 23.పెన్ స్టాండ్, 24.పిస్టిల్ మరియు మోర్టార్, 25.ప్రెషర్ కుక్కర్, 26.రిఫ్రిజ్ రేటర్, 27.రంపం, 28.నౌక, 29.బూటు, 30.సితార, 31.స్విచ్‌బోర్డు, 32.టెన్నిస్ రాకెట్, బంతి, 33.జావెలెన్ విసురడం, 34.టైర్స్, 35.కిటికి గుర్తులను కేటాయిస్తూ రాష్ట్ర ఎన్నికల సం ఘం జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చే సింది. నామినేషన్ల పక్రియ ప్రారంభమై, స్క్రూటీని, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బ్యాలెట్ పేపర్‌ను ముద్రించనున్నారు.

అధికారులకు మొదటి విడత శిక్షణ ఇచ్చాం



జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు మొదటి విడత నామినేషన్ల పక్రియ ఈ నెల 9న ప్రారంభం అవుతుంది. ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, పీవోలు, ఏపీవోలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. శిక్షణకు హాజరు కాని అధికారులకు మరో విడత శిక్షణ ఇవ్వనున్నాం. మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలలో ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నాం. ఎన్నికలకు 1,106 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా జిల్లాలో 3,200 బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి.

- జడ్పీ సీఈవో వెంకట్ రెడ్డి

విద్యార్థుల డుమ్మా

- దసరా సెలవుల అనంతరం తెరచుకున్న పాఠశాలలు
- స్టూడెంట్స్ లేక వెలవెలబోయిన చాలా స్కూల్స్
- వచ్చే వారంలో ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల అనంతరం పాఠశాలలు శనివారం పునఃప్రారంభం కాగా, విద్యార్థులు అరకొరగా వచ్చారు. ఉమ్మడి జిల్లాలోని 3,592 ప్రభుత్వ, గురుకుల, కేజీబీవీ, ప్రైవేట్ పాఠశాలలకు గత నెల 21 నుంచి ఈ నెల 3 వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించింది. శనివారం పాఠశాలు మళ్లీ మొదలయ్యాయి. కానీ చాలా పాఠశాలలకు పట్టుమని పది మంది కూడా రాలేదు. ఉపాధ్యాయులు మాత్రం ఫుల్‌గా వచ్చారు. గురుకుల, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులే కనిపించ లేదు. మరుసటి రోజు ఆదివారం కావడంతో విద్యార్థులు రాలేదని, సోమవారం కూడా కొంత వరకు తక్కువగానే వచ్చే అవకాశం ఉపాధ్యాయులు చెబుతున్నారు. మంగళ, బుధవారాల నుంచి పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. వచ్చే వారంలో సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ-1) నిర్వహించనున్నారు. అందుకు జిల్లా కామన్ పరీక్షల బోర్డు(డీసీఈబీ) ఇప్పటికే ప్రశ్నపత్రాలు సిద్ధం చేసింది.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- ఎన్నికల కోడ్‌ను పాటించాలి
- రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రె వెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన తన చాంబర్‌లో ఆర్డీఓ నవీన్‌తో కలిసి తహసీల్దార్‌లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మధుసూదన్‌నాయక్ మాట్లాడుతూ భరతమాల రోడ్డు కోసం భూ సేకరణ త్వరగా చేట్టాలని మహబూబ్‌నగర్ రూరల్, దేవరకద్ర, సీసీకుంట మండలాల తహసీల్దార్లకు చెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మోడల్ కోడ్ పాటించాలని అన్ని మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. అంతకు ముందు రైస్ మిల్లర్లతో సమావేశమై సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు అన్ని రైస్ మిల్లులు తిరిగి, ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్పీ కార్యాలయంలో విభాగాల పరిశీలన

నారాయణపేట టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలోని వివిధ విభాగాలను ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం పరిశీలించారు. అధికారుల పనితీరు, రికార్డుల నిర్వహణను చూశారు. జిల్లాలోని అన్ని సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్‌లో వీక్షించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజాసేవలో క్రమశిక్షణ, పారదర్శకత కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్, ఆర్ఐ నరసింహ, ఎస్ఐలు నరేశ్, సునీత, పురుషోత్తం, సురేశ్ పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో విభాగాలను పరిశీలిస్తున్న ఎస్పీ డా.వినీత్

వృద్ధుల బాగోగులు చూసుకోవాలి

- ఫస్ట్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి రవిశంకర్



మాట్లాడుతున్న న్యాయాధికారి రవిశంకర్

కోయిలకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లోని వయో వృద్ధుల బాగోగులను మంచిగా చూసుకోవాలని ఫస్ట్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి ఏ.రవిశంకర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ సేవా సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉన్నత కుటుంబంలోని వారు వయో వృద్ధుల బాగోగులు చూసుకోకుండా వారిని అనాథ ఆశ్రమంలో వదిలి విదేశాలకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి దండ్రులు, అత్తమామలను మంచిగా చూసుకోవాలని తెలిపారు. సీనియర్ సిటిజన్ చట్టం గురించి అందరికీ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రైతుల చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామస్థులకు ఏమైన న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ దృష్టికి తీసుకరావాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజా గణేష్, ఎంపీడీవో ఆనంద్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రవీందర్ నాయక్, ఎస్ఐ తిరు పాజీ, డిప్యూటీ లీగల్ కౌన్సిల్ యోగేశ్వర్‌రాజ్, ఎంపీఓ చంద్రశేఖర్, అడ్వకేట్ తిరుపతయ్య పాల్గొన్నారు.

కూలీలు దొరక్క కష్టాలు

- పత్తి తీసేందుకు కొరత
- వర్షాలతో పెరిగిన కూలి రేట్లు 6
- కేజీ పత్తి తీతకు రూ.15
- పంటలో సగం డబ్బులు వారికే..

అప్పుల బాధతో.. తల్లి, కుమార్తె అదృశ్యం

- భర్త మృతి చెందడంతో తల్లితో కలిసి ఉంటున్న మహిళను మోసం చేసిన వ్యక్తి 7

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- 'పేట' డీఈఓ గోవిందరాజులు
- కోటకొండ జడ్పీహెచ్ఎస్ తనిఖీ



కోటకొండ పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న డీఈవో గోవిందరాజులు

నారాయణపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత తీసు కువచ్చేలా ఉపాధ్యాయులు సమష్టి కృషి చేయాలని నారాయణపేట విద్యాశాఖ అధికారి గోవిందరాజులు అన్నారు. శనివారం ఆయన నారాయణపేట మండలంలోని కోటకొండ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎంశ్రీ పాఠశాల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు. రికార్డులను చూశారు. పాఠశాల ఆవరణలో ఉన్న కిచెన్ గార్డెన్ పచ్చదనంతో కనిపించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పూర్తి స్థాయి నివేదికలతో ఉండటంతో హెచ్ఎం సునీతను అభినందించారు. అనంతరం డీఈవో ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

ఇప్పుడెలా..

అదే పరిస్థితి ఏర్పడింది. గతంలో రిజర్వేషన్ల ప్రకారం పోటీ చేసిన నాయకులు అక్కడ పాగా వేయగా.. ఈసారి కూడా తామే పోటీలో ఉంటామని భావించారు. కానీ వారు కూడా తాము అర్హత కోల్పోతున్నామని ఆందోళన చెందుతున్నారు. జడ్పీ చైర్‌పర్సన్ నుంచి సర్పంచ్ వరకు అందరూ ఇదే ఆవేదన, ఆవేశాలకు లోనవుతున్నారు.

జడ్పీపీఠం ఆశలు గల్లంతు..

జిల్లా పరిషత్ రిజర్వేషన్లు కూడా నాయకులకు అనుకూలంగా రాలేదు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి బీసీ మహిళకు, నారాయణపేట అన్ రిజర్వ్‌డ్ మహిళకు కేటాయించగా.. ఒక్క గద్వాల మాత్రమే ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. దీంతో చాలా మంది నాయకుల ఆశలు గల్లంతయ్యాయి. నారాయణపేట జిల్లా పరిషత్‌కు డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి పోటీచేసి గెలవాలని ఆశించారు. అలాగే సీఎం సొంత నియోజకవర్గం కోస్గికి చెందిన రఘువర్ధన్‌రెడ్డి కూడా పోటీకి ఉవ్విళ్లూరారు. వారు అనుకున్నట్లు రిజర్వేషన్లు రాలేదు. వీరితోపాటు దివంగత మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి తనయుడు సిద్ధార్థ్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే సోదరుడు అభిజయ్‌రెడ్డి కూడా పోటీ ఆశించి భంగపడ్డారు. గద్వాల ఎస్సీ జనరల్‌కు కేటాయించగా.. ఇక్కడ గడ్డం కృష్ణారెడ్డి, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డికి చోటులేకుండా పోయింది. మాజీ జడ్పీచైర్మన్ బండారు భాస్కర్‌కు అవకాశం ఉన్నప్పటికీ.. అది అంత సులభంగా లేదు. ఆయన సొంత నియోజకవర్గంలో ఒక్క ఎస్సీ జనరల్ జడ్పీటీసీ స్థానం లేదు. ఆయన పోటీ చేయాలంటే అలంపూర్ నియోజకవర్గం నుంచే సాధ్యం. బీఆర్ఎస్‌లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి అచ్చంపేట ఎమ్మెల్యే సతీమణి, మాజీ జడ్పీటీసీ అనురాధ ఈసారి బరిలో ఉండాలని భావించారు. కానీ బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో నిరాశ చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. వనపర్తి జడ్పీకి ఖిల్లాఘణపురం నుంచి సాయిచరణ్‌రెడ్డి, వనపర్తి నుంచి కిచ్చారెడ్డి, శ్రీరంగాపూర్ నుంచి రాజేంద్రప్రసాద్ పోటీ చేయాలని ఆశించగా.. ఈ స్థానం బీసీ మహిళలకు రిజర్వ్ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. మహబూబ్‌నగర్ జడ్పీకి సంబంధించి కౌకుంట్లకు చెందిన అరవింద్‌రెడ్డి, నగరానికి చెందిన ఎన్‌పీ వెంకటేష్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోదరుడు దుశ్యంత్‌రెడ్డి పోటీచేయాలని భావించగా.. బీసీ మహిళకు రిజర్వ్ అయ్యింది. ప్రస్తుతం రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉండటంతో ఎన్నికలు రద్దయితే ఊపిరి పీల్చుకుంటామని చెబుతున్నారు. జరిగితే మాత్రం ఉమ్మడి పాలమూరు రాజకీయ ముఖచిత్రంపై కొత్త ముఖాలు కనిపించే అవకాశం ఉంది.

భూవివాదంలో వ్యక్తి రిమాండ్

ఊర్కొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో వ్యక్తిని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి కృష్ణయ్య గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో పంటలకు రక్షణగా రాతి కడీలను ఏర్పాటు చేసుకున్నాడు. కుమ్మరి బాలస్వామి (కృష్ణయ్య)తో గొడవ పడి రాతి కడీలను ధ్వంసం చేశాడు. దాంతో కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసుకొని శనివారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరుచగా కోర్టు న్యాయాధికారి బాలస్వామిని 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తమ్ముడిపై అన్నదాడి : కేసు నమోదు

మల్దకల్(గద్వాల), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మల్దకల్ మండలం తాటికుంట గ్రామంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య వివాదం చోటు చేసుకోగా తమ్ముడిపై అన్నదాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై నందీకర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్న చెన్నయ్య, తమ్ముడు రాజు ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. అయితే గుర్తు తెలియని వ్యక్తులు తమ్ముడి ఇంటికి వచ్చిపోవడం నచ్చని అన్న ఇంట్లో వాళ్లని సరిదిద్దుకొని గౌరవంగా బతకాలని సూచించాడు.

ఈ క్రమంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య మాటమాట పెరగడంతో ఆవేశంలో అన్న చెన్నయ్య తమ్ముడు రాజుపై దాడి చేయడంతో తలకు గాయాలు అయ్యాయని రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాహితుడిపై పోక్సో కేసు నమోదు

ఆత్మకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వివాహితుడిపై పోక్సో కేసు నమోదైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండల పరిధికి చెందిన 16 ఏళ్ల చిన్నారిపై ఇంటి పరిసర ప్రాంతంలో ఉన్న ఓ వ్యక్తి గత కొంతకాలంగా అత్యాచారానికి గురిచేస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ చిన్నారి గర్భం దాల్చడంతో శుక్రవారం రాత్రి తీవ్రస్థాయిలో రక్తస్రావం కావడంతో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివాహితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

మందుకొడిగా..


మద్యం దుకాణాలకు దరఖాస్తు చేస్తున్న వ్యాపారి (ఫైల్)

- మద్యం దుకాణాలకు 9 రోజుల్లో 7 దరఖాస్తులే
- ఉమ్మడి జిల్లాలో 227 మద్యం దుకాణాలు
- టెండర్లపై ఎన్నికల ఎఫెక్ట్..!
- ఈనెల 18 వరకు గడువు

మహబూబ్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.. మద్యం టెండర్లు అనగానే వ్యాపారులు పోటాపోటీగా టెండర్లు వేసేవాళ్లు. అలాంటిది టెండర్లు షురూ అయి తొమ్మిది రోజులు అవుతున్నా ఇప్పటవరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 227 దుకాణాలకు కేవలం తొమ్మిది టెండర్లే వచ్చాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో 4, నారాయణపేట జిల్లాలో 1, నాగర్‌కర్నూల్ జిల్లాలో 2 దరఖాస్తులు వచ్చాయి. చివరి నాలుగైదు రోజుల్లోనే పెద్ద మొత్తంలో టెండర్లు వేసే అవకాశం ఉంది. అయితే గతానికి భిన్నంగా ఈసారి టెండర్ల ప్రక్రియ సాగనున్నట్లు తెలుస్తోంది. గతంలో మద్యం దుకాణాల దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండగా ఇప్పుడు ఆ రుసుమును రూ.3 లక్షలకు పెంచడంతో వ్యాపారులు ఆలోచనలో పడ్డారు. ఈ డబ్బు వెనక్కి ఇవ్వబడదు. దరఖాస్తుల రూపంలోనే పెద్దమొత్తంలో ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం దరఖాస్తు ధరను 50 శాతం పెంచేసింది. 2023లో జరిగిన మద్యం టెండర్లలో అప్పుడు ఉమ్మడి జిల్లాలో 230 మద్యం దుకాణాలు ఉండగా, రికార్డ్ స్థాయిలో 8595 దరఖాస్తులు వచ్చాయి. అలంపూర్ పరిధిలోని పుల్లూరు దుకాణానికి అత్యధికంగా 99 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి పాలమూరులో దరఖాస్తుల రూపంలోనే ప్రభుత్వానికి రూ.171.90 కోట్ల ఆదాయం సమకూరింది. ఇప్పుడు దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలకు పెంచడంతో రూ.200కోట్లకు పైగా అప్లికేషన్‌ల రూపంలోనే రానున్నట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో..

స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో పోటీచేసే ఆశావహులు టెండర్లలో పాల్గొనకపోవచ్చన్న చర్చ సాగుతోంది. ఎన్నికల్లో సర్పంచ్‌కు అయితే రూ.15-25 లక్షలు, జడ్పీటీసీ, ఎంపీపీ పదవికి పోటీ పడే అభ్యర్థులకు రూ.30 లక్షలకు పైగానే ఖర్చు కానుంది. మద్యం టెండర్లలో ఎక్కువగా ద్వితీయశ్రేణి నాయకులు పాల్గొంటారు. ఇప్పుడు ఎన్నికలు తోడవడంతో ఎన్నికల ఖర్చు, మద్యం టెండర్ల ఖర్చు భరించే స్థోమత లేనివాళ్లు ఏదో ఒక మార్గాన్నే ఎంచుకునే అవకాశం ఉన్నందున ఆ ఎఫెక్ట్ టెండర్లపై పడే సూచనలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల అయింది. దీని ప్రకారం ఈ రెండు ఎన్నికలు ప్రస్తుతం కొనసాగుతున్న ఎక్సైజ్‌పాలసీలోనే అంటే ఇప్పుడు మద్యం దుకాణాలు నడుపుతున్న వారి హయాంలోనే ఎన్నికలు పూర్తికానున్నాయి. అక్టోబరులో సర్పంచ్‌లు పూర్తి చేసి నవంబరులో పురపాలిక ఎన్నికలు నిర్వహిస్తే అవి కూడా ప్రస్తుత పాలసీ ఖాతాలోనే పడనున్నాయి. కొత్త మద్యం పాలసీ డిసెంబరు 1 నుంచి ప్రారంభం కానున్నందున కొత్తగా దుకాణాలు దక్కించుకునే వారికి స్థానిక సంస్థల ఎన్నికలు రావన్నది స్పష్టమవుతోంది. ఈ కారణంగా కూడా మద్యం వ్యాపారులు ఆసక్తి చూపకపోవచ్చన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

కాగా జిల్లాయేతర మద్యం వ్యాపారులు పెద్ద ఎత్తున టెండర్లలో పాల్గొననున్నారు. కర్నూల్, అనంతపూర్, విజయవాడ, కృష్ణ, శ్రీకాకుళం, గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు ప్రతిసారి పెద్దఎత్తున టెండర్లలో పాల్గొంటున్నారు. ఈసారి కూడా బయటి వ్యాపారులు టెండర్లలో పాల్గొనే అవకాశం ఉంది. దసరా పండగ పూర్తైనందున పండగ తరువాత టెండర్ల ప్రక్రియ ఊపందుకోనుందని ఎక్సైజ్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 18 వరకు దరఖాస్తు గడువు ఉన్నందున 10వ తేదీ తరువాత పెద్దఎత్తున టెండర్లు వేస్తారని అంచనా వేస్తున్నారు.

కూలీలు దొరక్క కష్టాలు


పొలంలో కాసిన పత్తి

- పత్తి తీసేందుకు కొరత
- వర్షాలతో పెరిగిన కూలి రేట్లు
- కేజీ పత్తి తీతకు రూ.15
- పంటలో సగం డబ్బులు వారికే..

మరికల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంటలు దిగుబడి వచ్చే సరికి కూలీ రేట్లు పెరగడంతో రైతులు అల్లాడిపోతున్నారు. పంట చేతికి వచ్చినప్పటి నుంచి వర్షాలు కురుస్తుండటంతో కాసిన పత్తి నల్లబారుతోంది. దీంతో చేసేది లేక ఒక కేజీ పత్తి తీయడానికి రూ 15 నుంచి రూ 20 వరకు కూలి చెల్లించి తీయిస్తున్నారు. వర్షాల ఎఫెక్ట్‌తో కూలీల డిమాండ్ బాగా పెరిగి పోయింది. దీంతో దూర ప్రాంతాలైన మరికల్, ధన్వాడ మండలాలు, గ్రామాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో పత్తి తీయడానికి వస్తున్నారు. పత్తిని తీయించాలనే ఉద్దేశంతో రైతులు పోటీపడి కూలీ రేట్లు పెంచేసుకొని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వర్షాల వల్ల 50 శాతం పంటలు నష్టపోయారు. ఈ క్రమంలో చేతికి వచ్చిన పంటను తీసు కుందామంటే కూలీల రేట్లు పెరగడంతో రైతులు అయోమయంలో పడ్డారు. కనీసం తీసిన పత్తిని మార్కెట్‌కు తీసుకువెళితే క్వింటాలు రూ.6 వేల నుంచి 7 వేల వరకు ధర పలుకుతోంది. ఇం దులో పెట్టుబడులు కాదని కూలీలకే రూ.2 వేలు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కూలీలను పిలిస్తే రోజుకు రూ 250లు ఇవ్వాల్సి ఉండగా, రూ.450లు అడుగుతున్నారు. మరికొందరు రైతులు తప్పని పరిస్థితిలో రూ.450లు చెల్లించి పొలంలో పత్తి తీయిస్తున్నారు. పంటను పొలంలో వదిలిపెట్టలేక అధికంగా కూ లీలు చెల్లించి పంటను తీసుకుంటున్నారు. కనీసం వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కూలీలు దొరకడం లేదు



పొలంలో పత్తి పగిలినప్పటికీ కూలీలు దొరకడం లేదు. రోజువారి కూలీలకు రాకుండా కేజీల ప్రకారం తీసేందుకు వస్తామని కూలీలు చెబుతున్నారు. గత సంవత్సరం కేజీ రూ.10లు ఉండగా ప్రస్తుతం రూ.15లకు చేరుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పండిన పత్తిపంట నాశనం అవుతున్నది. వర్షాలకు భయపడి ఎంత రేటైనా చెల్లించాల్సి వస్తుంది. నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

– కృష్ణారెడ్డి, రైతు, అప్పంపల్లి గ్రామం

ఒక కేజీ పత్తితీతకు రూ.15లు అడుగుతున్నారు..



రోజూ మేఘాలు కమ్ముకోవడంతో పత్తి దొబ్బతింటుందనే ఉద్దేశంతో ఒక కేజీకి రూ.15 ఇచ్చి తీయిస్తున్నాం. ఒక క్వింటాల్‌కు కూలీలకు రూ.1600 నుంచి 2వేలు ఖర్చు అవుతున్నది. రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఒకపక్క వర్షాలు, మరోపక్క కూలీల రేట్లతో ఇబ్బందులు పడుతున్నాం. ఇలా ఉంటే రైతులు పంటలు పండించడం చాలా కష్టం. కనీసం దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– హన్మంతు, రైతు, పల్లెగడ్డ గ్రామం

పోతేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను త్వరితగతిన పూర్తి చేస్తాం

- ట్రాన్స్‌కో ఎస్ఈ నర్సింహారెడ్డి

వెల్దండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తి నిర్మాణంతో ఉన్న పోతేపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను త్వరలోనే పూర్తి చేస్తామని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ నర్సింహారెడ్డి అన్నారు. గత కొన్నేళ్లుగా మండలంలోని పోతేపల్లిలో అసంపూర్తి నిర్మాణంతో నిలిచిపోయిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కావాల్సిన సదుపాయాలు, మిగిలిపోయిన పనులపై ఆరా తీశారు. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బ్రేకర్లు, 11కేవీ విద్యుత్ లైన్లు తదితర పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేయాలని సూచించారు. సోమవారం నుంచి ఎలక్ట్రికల్, సివిల్ పనులను చేపట్టేందుకు అవసరమగు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. నెలరోజుల్లోగా సబ్‌స్టేషన్ పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలని నర్సింహారెడ్డి సూచించారు.

శ్రీశైలం జలాశయానికి తగ్గిన వరద

- పది నుంచి ఎనిమిది గేట్లకు తగ్గింపు

గద్వాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా ప్రాజెక్టులకు క్రమేపి వరద తగ్గుతోంది. కర్ణాటక, మహారాష్ట్రలలో వర్షాలు తగ్గడంతో ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. శనివారం శ్రీశైలం జలాశయానికి 2.95 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఎనిమిది గేట్ల ద్వారా 2.21 లక్షల క్యూసెక్కులను, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 65,976 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 210.99 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి నుంచి నారాయణపూర్‌కు 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 38 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీకి 2.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తం జూరాలకు చేరుతోంది. జూరాలకు 2.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 11 గేట్ల ద్వారా 1.79 లక్షలు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 30,422 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల బ్యారేజీకి 13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 8 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాటుదేలుతున్న మణిరాజ్

- సానబెట్టడంతో వెలుగులోకి అత్యుత్తమ ప్రతిభ
- ఐదేళ్ల బాలుడి కరాటే విన్యాసాలు స్ఫూర్తిదాయకం


కరాటేలో రాటుదేలుతున్న మణిరాజ్

లింగాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అక్షరాలు నేర్చుకునే సమయంలో మార్షల్ ఆర్ట్స్ రాటుదేలుతూనే సంగీతం, మెదడుకు పదును పెట్టే చదరంగం క్రీడల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడీ ఐదేళ్ల చిన్నోడు. చదువుతోపాటు కరాటే పట్ల ఎనలేని ఇష్టం కనబరుస్తూ అద్భుత ప్రతిభతో వాహ్వా అనిపించుకుంటున్నాడు నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన ఐదేళ్ల మణిరాజ్. నేరుగా ఒకటవ తరగతి ప్రవేశం పొంది చక్కగా చదువుకుంటూనే కరాటే పట్ల ఆసక్తి పెంచుకున్నాడు. అంతేకాకుండా కీబోర్డుపైన సంగీత స్వరాలు పలికిస్తూ తన గానంతో అందరినీ మైమరిపించేస్తున్నాడు. చదరంగంలో పావులు కదుపుతూ ఎత్తుకు పైఎత్తు వేస్తూ వ్యూహాలు పన్నుతున్న ఈ చిన్నారి దినచర్య ప్రతీ రోజు తెల్లవారుజామున 5గంటలకే మొదలవుతుంది. స్వీయ రక్షణకు దోహదపడే కరాటేను పల్లెల్లో అందరికీ చేరువ చేయాలని లక్ష్యంతో బల్మూరు మండల కేంద్రానికి చెందిన బ్లాక్ బెల్ట్ మాస్టర్ ముఖేష్ మారుమూల గిరిజన ప్రాంతమైన లింగాల మండల కేంద్రంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ తరగతులు మణిరాజ్ పాలిట వరంగా మారింది.

తన అక్క హర్షితతో కలిసి తెల్లవారక ముందే క్రమం తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరు కావడం కీలక మలుపు కాగా, కరాటేలో తన ఎదుగుదలకు తొలి అడుగు పడింది. కరాటే పట్ల మణిరాజ్ కనబరుస్తున్న ఆసక్తి.. నేర్చుకోవాలనే తపన ప్రావీణ్యం గుర్తించిన శిక్షకుడు ముఖేష్ ప్రత్యేక శ్రద్ధతో తర్ఫీదు ఇస్తూ సానపెట్టడంతో ఆ బాలుడిలోని అత్యుత్తమ ప్రతిభ వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల భరోసా, కోచ్ నిత్యం అందిస్తున్న శిక్షణతో అనతి కాలంలోనే కరాటేలో మెలకువలు నేర్చుకుంటూ రాటుదేలుతున్నాడు. శిక్షకుడు ముఖేష్ మార్గదర్శకంలో కరాటేతో పాటు కర్రసాము, కిక్ బాక్సింగ్, నాన్ చాకు, జూడో టెక్నిక్స్ స్టిచ్చింగ్, పంచులు కొట్టడం వంటి సాహసవంతమైన అంశాలపై తర్ఫీదు పొందుతూ తన నైపుణ్యాలకు పదును పెట్టుకుంటూ తన అక్క హర్షితతో కలిసి సాధన చేస్తూ ముందడుగు వేస్తూ అదరగొడుతున్నాడు. జూన్‌లో లింగాలలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో కఠినమైన ఆసనాలు సులువుగా వేస్తున్న మణిరాజ్ ప్రావీణ్యాన్ని పరిశీలించిన బ్లాక్ బెల్ట్ డాన్-6 గ్రాండ్ మాస్టర్ ఏ.రవి మెచ్చుకుంటూ ప్రత్యేక బహుమతి అందజేసి ప్రశంసించారు. చిన్న పిల్లోడికి ఎంతో ఓర్పు సహనంతో కరాటే విద్యనందిస్తున్న మాస్టర్ ముఖేష్‌ను అభినందిస్తూ వయస్సు దృష్ట్యా ఎలాంటి టోర్నమెంట్‌లకు ఈ బుడతోడిని పంపకుండా కరాటే మూలాలు బాగా వంటపట్టేలా నేర్పిస్తూ బెల్ట్ గ్రేడ్ పరీక్షకు సంసిద్ధం చేయాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రేవల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : విజయదశమి పండుగ మరుసటి రోజు శుక్రవారం అత్తగారింటికి వచ్చిన అల్లుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా ఏదుల మండలంలోని చెన్నారం గ్రామంలో చోటు చేసుకుంది. శనివారం గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నారం గ్రామంలో గడ్డమీద నరసింహకు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య బొజ్జమ్మ, కూతురు భాగ్య వేరేగా నివాసం ఉంటున్నారు. నరసింహ రెండవ భార్య పెంటమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు. నరసింహ తన కూతురిని అన్నారం గ్రామానికి చెందిన నరసింహ అనే యువకునికి ఇచ్చి వివాహం చేశాడు. విజయదశమి పండుగ సందర్భంగా మరుసటి రోజు అత్తగారింటికి వచ్చిన అల్లుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

కత్తులతో యువకులు స్వైర విహారం

- 8 మందిపై కేసు నమోదు

అమరచింత, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షలతో కొంతమంది యువకులు కత్తులతో గొడవకు దిగగా ఆ గొడవను విడిపించడానికి వెళ్లిన వ్యక్తికి కత్తి గాయం ఏర్పడింది. ఈ ఘటనకు బాధ్యులైన 8 మందిపై కేసు నమోదైన ఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలం నాగల్‌కడుమూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం అర్ధరాత్రి నర్వ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకులు మరో గ్రామానికి చెందిన కొందరితో గొడవకు దిగారు. ఈ గొడవ కాస్త పెద్దగయ్యే అవకాశం ఉన్నందున నాగల్‌కడుమూర్ గ్రామానికి చెందిన అహ్మద్ పాషా అనే వ్యక్తి గొడవ పడుతున్న వ్యక్తుల వద్దకు వెళ్లి సర్ది చెప్పాడు. ఈ క్రమంలో నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకులు కత్తులతో దాడి చేయగా తీవ్ర గాయం ఏర్పడింది. దీంతో గమనించిన గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఘటనకు బాధ్యులను తరిమివేయగా గాయపడిన అహ్మద్ పాషాను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గ్రామస్థులు అమరచింత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ స్వాతి గ్రామానికి చేరుకుని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 8 మందిపై కేసు నమోదు చేశారు. అహ్మద్ పాషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

వర్షాలు అధికం.. వర్షపాతం అత్యల్పం


యంగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ వర్షపాతం నమోదు కేంద్రం


వర్షపాతం నమోదుకు సంబంధించిన కొలతలకు చెందిన వస్తువులు

రేయిన్‌గేజ్‌లలో నమోదు కాని వివరాలు

- 24 గ్రామ పంచాయతీలకు రెండు రేయిన్‌గేజ్‌లు
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 20 మ్యానువల్, 35 ఆటోమేటిక్ రేయిన్‌గేజ్‌లు
- కుండపోత వర్షం కురిసినా తక్కువ వర్షపాతం నమోదైన వైనం

తాడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా తాడూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అత్యధిక వర్షం కురిసి చెరువులు, కుంటలు అలుగులు పారడంతోపాటు ఇళ్లల్లోకి నీరు చేరుకున్నది. అయినా కూడా రేయిన్‌గేజ్‌లో మాత్రం అతి తక్కువ వర్షపాతం నమోదవుతుండటంతో ప్రజలు అవ్వాక్కవ్వుతున్న పరిస్థితి నెలకొంది.

తెలంగాణలో అత్యధిక విస్తీర్ణం కలిగిన నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న నాలుగు మునిసిపాలిటీలు 20 మండలాల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 20 మ్యానువల్ రేయిన్‌గేజ్‌లతోపాటు 35 ఆటోమేటికల్ రేయిన్‌గేజ్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గత కొంతకాలంగా మనం చూస్తున్న పరిస్థితుల రీత్యా కిలో మీటరు వ్యవధిలోనే కుండపోత వర్షం కురిసి అతలాకుతలం చేస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కో మండలానికి 2నుంచి 3మాత్రమే రేయిన్‌గేజ్‌లు ఏర్పాటు చేయడం మూలంగా వర్షపాతం నమోదుకు సంబంధించి ఎలాంటి డాటాను ప్రభుత్వం తీసుకోగలుగుతుందో ఆలోచన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఊరికి ఊరికి మధ్యలోనే సృష్టిస్తున్న వరద బీభత్సం రేయిన్‌గేజ్‌లు తక్కువగా ఉండటం మూలంగా అత్యధికంగా కురిసిన వర్షపాతం నమోదు కాని పరిస్థితి నెలకొంది. ఇటీవల తాడూరు మండలంలోని మేడిపూర్ గ్రామంలో తీవ్ర కుంభవృష్టిగా వర్షం కురిసి ఇళ్లల్లోకి నీరు చేరడంతోపాటు గ్రామంలో ఉన్న ప్రాథమిక జిల్లా పరిషత్ పాఠశాలల్లోకి సైతం వర్షపు నీరు చేరుకుని పాఠశాల భవనాలన్నీ వర్షపు నీటిలో మునిగిపోయాయి. ఈ తరుణంలో మేడిపూర్ గ్రామంలో సుమారు 6కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆటోమేటికల్ రేయిన్‌గేజ్‌లో మాత్రం 11 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదు కావడం అందరినీ ఆశ్చర్యానికి లోను చేసింది.

అదేవిధంగా తాడూరు మండలంలోని పాపగల్, భలాన్‌పల్లి, ఐతోల్, సిర్సవాడ, గోవిందాయపల్లి, ఎట్టిధార్‌పల్లి, అంతారం గ్రామాల్లో కుండపోత వర్షం కురిసి ప్రధాన రహదారులపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలన్నీ ఎక్కిపారుతున్న వర్షపు నీటితో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ తరుణంలో పాపగల్ గ్రామానికి సుమారు 18కిలో మీటర్ల దూరంలో ఉన్న తాడూరు వర్షపాత నమోదు రేయిన్‌గేజ్‌లో మాత్రం ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. దీంతో వర్షపాతం నమోదు కేంద్రాలపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సంబంధించి పంట నష్ట పరిహారాలు ఇవ్వాలన్న సమయంలో మండలానికి సంబంధించిన వర్షపాతం నమోదు కేంద్రాల వివరాల ఆధారంగానే రైతులకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వ నివేదికలకు రేయిన్‌గేజీలే కీలకంగా ఉంటాయి. ఈ తరుణంలో చాలా గ్రామాలకు రేయిన్‌గేజ్‌లు లేకపోవడం మూలంగా ఏ మేరకు వర్షం పడుతుందో తెలియకపోవడం మూలంగా రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రభుత్వం అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా ఉన్న రేయిన్‌గేజ్‌లకు అదనంగా మరికొన్ని వర్షపాత నమోదు కేంద్రాలను పెంచాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు.

పొలాల్లో వరదలు వచ్చినా వర్షం కురవలేదంటున్నారు...



ప్రస్తుతం మా గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా వర్షపాతం నమోదు కేంద్రాలు లేకపోవడం మూలంగా ఎంత వర్షం కురిసినా అధికారులు మాత్రం వర్షం కురవలేదనే విషయాన్ని వెల్లడిస్తుండడంతో తీవ్ర ఆందోళన నెలకొంటున్నది. వర్షం పెద్ద మొత్తంలో కురిసి పంటలు దెబ్బతిని పొలాలు కోతలకు గురైనా వర్షం కురవలేదంటున్న అధికారుల లెక్కలు ఏ విధంగా అర్థం చేసుకోవాలి. వర్షపాత నమోదు కేంద్రాలు అసలు పని చేస్తున్నాయా, ఏఏ గ్రామాల్లో ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది.

– మల్లయ్య సిర్సవాడ గ్రామ రైతు

వర్షపాతం నమోదు కేంద్రాలను ఎక్కువగా పెంచాలి



ప్రస్తుతం ఉన్న వర్షపాతం నమోదు కేంద్రాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రస్తుత విపత్తులకనుగుణంగా అధునాతన సాంకేతికతను జోడించి నూతన వర్షపాత నమోదు కేంద్రాలను రెండు గ్రామాలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసినట్లయితేనే ఏఏ గ్రామంలో ఎంత వర్షపాతం నమోదవుతుందన్న పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయి. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న పంటలు దెబ్బతిన్నట్లయితే ఇన్సూరెన్స్ కంపెనీలు గ్రామాల్లో కురిసిన వర్షపాతం నమోదు ఆధారంగానే ఇన్సూరెన్స్ ఇస్తున్న క్రమంలో గ్రామాల్లో వర్షపాతం నమోదు కేంద్రాలే లేనప్పుడు ఏ విధంగా నష్ట పరిహారం ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

– కరుణాకర్, అల్లాపూర్ గ్రామం మాజీ ఎంపీటీసీ సభ్యుడు

క్రైం కార్నర్

బారికేడ్‌ను బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం



మ్యాదరి కురుమూర్తి (ఫైల్)

మరికల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోళ్ల దాబా నుంచి తన సొంత బైక్‌పై స్వగ్రామానికి వెళుతూ బారికేడ్‌ను ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. మరికల్ మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న బారికేడ్‌ను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నారాయణపేట జిల్లా మరికల్ మండలం మాధ్వార్ గ్రామానికి చెందిన మ్యాదరి కురుమూర్తి (28) శుక్రవారం అర్ధరాత్రి మండల శివారులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మృతి చెందిన యువకుడు కోళ్ల వ్యాపారం చేసేవాడు. మృతుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణం పోయేది కాదని ఎస్ఐ రాము తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మదనాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సరళాసాగర్ వద్ద చేపల వేటకు వెళ్లి గల్లంతైన సంఘటనలో వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. మదనాపురం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టు దిగువన కొత్తకోటకు చెందిన శేఖర్ (40) వ రద నీటిలో కొట్టుకుపోయాడు. ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లతో వెతికించగా శనివారం మధ్యాహ్నం మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చేపల వేటకు వెళ్లి.. నీటిలో మునిగి..



ఆకుల చెన్నయ్య (ఫైల్)

మూసాపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అడ్డాకుల మండలం శాఖాపూర్ గ్రామంలో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తుగా చెరువు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా... గ్రామానికి చెందిన ఆకుల చెన్నయ్య(40) అనే వ్యక్తి శుక్రవారం గ్రామ పరిధిలో చెరువులో చేపల వేట కోసం వెళ్లి ప్రమాదవశాత్తుగా నీటిలో మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించగా శనివారం చెరువులో మృతి చెంది నీటిలో తేలడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆకస్మిక మృతితో పండుగపూట గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వ్యక్తికి గాయాలు

కొత్తకోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామ శివారు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్ఐ ఆనంద్ వివరాల మేరకు.. కానాయపల్లి గ్రామానికి చెందిన నరేందర్ పెద్దమందడి మండల మోజర్ల గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామం వస్తుండగా కర్నూల్ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. గాయపడిన నరేందర్‌ను చికిత్స నిమిత్తం కొత్తకోటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం



ఆర్టీసీ డీలక్స్ బస్సు ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం

వనపర్తి రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో నుజ్జు నుజ్జయిన సంఘటన వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం చోటు చేసుకుంది. వనపర్తి మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన శేఖర్ ఆర్టీసీ బస్టాండ్‌లో తమ బంధువులను బస్సులో ఎక్కించేందుకు ద్విచక్ర వాహనాన్ని పార్కు చేసి వెళ్లాడు. అక్కడే బస్టాప్‌లో హైదరాబాద్‌కు వెళ్లే డీలక్స్ బస్సు ఆగి ఉంది. డీలక్స్ బస్సు డ్రైవర్ ప్రయాణికులతో టికెట్లు తీసుకుంటుండగా బస్సు సాంకేతిక లోపంతో దానంతట అదే ముందుకు కదిలి నిలిచి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అదే సందర్భంలో అక్కడే వాహనంపై నిల్చున్న కొందరు బస్సు రావడాన్ని గమనించి ముందుకు వెళ్లారు. ఒకవేళ ప్రయాణికులు ముందుకు వస్తున్న బస్సును గమనించకుండా ఉంటే ప్రాణనష్టం జరిగేదని పలువురు వాపోయారు.

60 ఏళ్లు దాటితే..



రైతులకు జీవితాంతం పింఛన్

- కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం
- రైతు మరణిస్తే భార్యకు వర్తింపు
- అవగాహన లేక నీరుగారుతున్న వైనం



పెబ్బేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. వాటిపై పూర్తిగా అవగాహన లేకపోవడంతో రైతులు అందిపుచ్చుకోవడంలో పథకాలు అక్కరకు రాకుండా పోతున్నాయి. చాలా పథకాలు వారు వ్యవసాయం చేస్తున్నంత కాలమే అండగా నిలుస్తాయి. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తరువాత చాలా మందికి ఆదాయ మార్గాలుండవు. ఈ నేపథ్యంలో 60 ఏళ్లు దాటిన సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం కల్పించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం ప్రవేశపెట్టింది. వృద్ధులైన రైతులకు ప్రతీ నెలా రూ.3వేల చొప్పున జీవితాంతం పింఛన్ ఇవ్వడమే పథకం ప్రధాన లక్ష్యం.

ఐదు ఎకరాలలోపు సన్న, చిన్నకారు రైతులు అర్హులు

ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకానికి 18 నుంచి 40ఏళ్లు ఉండి, ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులు అర్హులు. ఈ పథకానికి ఎంపిక కావాలంటే రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18 నుంచి 40 ఏళ్లలోపు ఎప్పుడు నమోదు చేసుకున్నా పింఛన్ 60ఏండ్లు దాటిన తరువాతనే వస్తుంది. రైతు చెల్లించిన ప్రీమియం మొత్తానికి కేంద్ర ప్రభుత్వం సమానంగా చెల్లిస్తుంది. రైతు రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియంను బ్యాంకు ఖాతా నుంచి చెల్లించాలి. రైతు రూ.55 జమ చేస్తే.. కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.55 కలిపి ప్రతీనెల రూ.110 జమ అవుతాయి. 20 నుంచి 25 ఏళ్లున్న రైతులు రూ.61, 30 ఏళ్లున్న వారికి రూ.105, 35ఏళ్ల వారికి రూ.150, 40ఏళ్ల వారికి రూ.200 ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించిన రైతు మరణిస్తే ఈ పథకాన్ని భార్య కొనసాగించవచ్చు. 60ఏళ్లు దాటిన తరువాత రైతు మరణిస్తే భార్యకు రూ.1500 పింఛన్ వస్తుంది.

ఇదిలా ఉంటే, నేషన ల్ పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్), ఈఎస్ఐ, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్న, ప్రభుత్వ ఉద్యోగులు, పన్ను చెల్లింపుదారులు, ఆర్థికంగా ఉన్న, సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్న రైతులకు ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం వర్తించదు.

అవగాహన ఏదీ?

క్షేత్రస్థాయిలో అధికారులు పథకాలపైన అవగాహన కల్పించకపోవడంతో రైతులకు అవి అక్కరకు రాకుండాపోతున్నాయి. ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం ద్వారా పింఛన్ ప్రయోజనం పొందేందుకు ఆసక్తి ఉన్న రైతులు మీసేవా కేంద్రానికి వెళ్లి పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్, నామినీ వివరాలతో పాటు రైతు సంతకంతో అప్‌లోడ్ చేసిన అనంతరం పింఛన్ కార్డు వస్తుంది. తరువాత పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం నగదు చెల్లించాలి.

రైతులకు అవగాహన లేదు...



ప్రతి గ్రామంలో ఏతః వోలు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలి. పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకంపై రైతులకు అవగాహన లేదు. పథకంపై గ్రామ, మండల, జిల్లా స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలి. ప్రతీ సంక్షేమ ఫలం రైతులకు అందేవిధంగా ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం పని చేయాలి.

- మేకల ఆంజనేయులు, గ్రామీణ వ్యవసాయ పేదల సంఘం, వనపర్తి జిల్లా కార్యదర్శి

ప్రచారం చేస్తాం



రైతులకు వృద్ధాప్యంలో ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం ఎంతో ఆసరాగా ఉంటుంది. పథకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహిస్తాం. ఆసక్తి ఉన్న రైతులు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

- షేక్ మున్నా, మండల వ్యవసాయశాఖ అధికారి, పెబ్బేరు

త్వరలో మండల కమిటీలు వేస్తాం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని, అందుకు అనుగుణంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కోస్గి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో కోస్గి గుండుమాల్ బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయోలేదో తెలియదు.. ఈనెల 8వ తేదీన కోర్టు ఆదేశాలమేరకు నిర్ణయం ఉంటుందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కొడంగల్‌కు చేసిందేమిలేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా గ్రామాల్లో ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల పేర్లు ఖరారుచేసి తనకు అందజేయాలన్నారు. నారాయణపేట జిల్లా మాజీ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ శాసం రామకృష్ణ, నాయకులు పోషప్ప, వెంకట్ నర్సిములు, జనార్దన్‌రెడ్డి, తదితరులున్నారు.

వ్యక్తి బెదిరింపులు.. అప్పుల బాధతో.. తల్లి, కుమార్తె అదృశ్యం

జడ్చర్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : భర్త మృతి చెందడంతో తన తల్లితో కలిసి ఉంటున్న ఆమెను బంగారంతో పాటు నగదును దోచుకొని ఓ వ్యక్తి నిండా ముంచేశాడు. అంతటితో ఆగకుండా తీసుకున్న సొత్తును ఇవ్వనంటూ బెది రింపులకు గురిచేయగా, చేసిన అప్పుల బాధతో తల్లితో పాటు ఆమె కనిపించ కుండా పోయారు. ఈ సంఘటన జడ్చర్లలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి పోలీసుల వివరాలిలా ఉన్నాయి. ఎండీ ఇమ్రాన్ అనే వ్యక్తి వేధింపులతో వారు అదృశ్యం అయ్యారంటూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. జడ్చర్ల మండలం కిష్టారం గ్రామంలో పర్వీన్ తన తల్లి హమీదాబేగంతో కలిసి నివాసం ఉంటున్నది. పర్వీన్ భర్త షై నొద్దీన్ మృతి చెందడంతో తల్లితో నివాసం ఉంటుంది. అదే గ్రామానికి చెందిన ఎండీ ఇమ్రాన్ అనే వ్యక్తి పర్వీన్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమె వద్ద ఉన్న మూడు తులాల బంగారు వస్తువులు, అలాగే పర్వీన్ తల్లి హమీదాబేగం వద్ద ఉన్న నాలుగు తులాల బంగారం తీసుకున్నాడు. అలాగే వారు నివాసం ఉంటున్న ఇంటిపై సైతం రుణం తీసుకున్నాడు. వీటితో పాటు గ్రామంలో తల్లి, కుమార్తెలతో అప్పులు చేయించి, ఆ నగదును తీసుకున్నాడు. తీసుకున్న బంగారంతో పాటు అప్పులు చేసి తెచ్చిన నగదును ఇవ్వాలంటూ తల్లి, కుమార్తె ఎండీ ఇమ్రాన్‌ను కోరారు. ఇందుకు అతడు ఇవ్వనని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరించాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఆ తల్లి, కుమార్తెలు నాలుగు రోజులుగా కనిపించకుండా పోయారు. ఈ విషయమై హమీదాబేగం చిన్నకుమార్తె నాజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక తరలించొద్దన్న వ్యక్తిపై దాడి

వీపనగండ్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తన పొలం గుండా ఇసుక తరలించొద్దని చెప్పిన వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన సంఘటన వీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంటలో శనివారం చోటు చేసుకుంది.

తూముకుంట వాగు సమీపంలో పోతుల రామకృష్ణారెడ్డికి సొంత పొలం ఉంది. పొలంలో నుంచి అదే గ్రామానికి చెందిన చిన్న రాంబాబు ట్రాక్టర్‌లో ఇసుక తరలించేందుకు వెళ్లాడు. నా పొలం మీదుగా ఇసుక తరలించొద్దని ట్రాక్టర్‌ను ఆపాడు. నీవెవరు ఆపేదంటూ రాంబాబు దాడి చేసి గాయపరచడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాణి తెలిపారు.

నల్లమల వాసికి శ్రీశైలం ట్రస్ట్ బోర్డులో స్థానం



కట్టా సుధాకర్ రెడ్డి

అచ్చంపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా నల్లమల ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు కట్టా సుధాకర్ రెడ్డిని నియమిస్తూ శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కలిసి శ్రీశైలం బోర్డులో అచ్చంపేట ప్రాంతానికి చెందిన వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. నల్లమల ప్రాంతానికి చెందిన కట్టా సుధాకర్‌ను నియ మించడం పట్ల ఎమ్మెల్యే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు కట్టా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో సామాన్య కార్యకర్తగా మొదలైన నా జీవితం ఎన్నో కీలక పదవులు పొందానన్నారు. ఈ రోజు శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గా నియమించినందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు, బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు కావడం పట్ల నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్, రాష్ట్ర నాయకుడు గువ్వల బాలరాజుతో ప లువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆరు యూనిట్లకే పరిమితమైన జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో జల విద్యుత్ ఉత్పత్తి ఆరు యూనిట్లకే పరిమితం అయినట్లు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న కారణంగా దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో పూర్తిగా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలోని ఆరు యూనిట్లను ప్రారంభించి గడిచిన 24 గంటల్లో 3.122 మిలియన్ యూనిట్లను చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 378.189 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు ఆయన తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో గత వారం రోజులుగా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోగా ఇప్పటి వరకు చేసిన ఉత్పత్తి 370.862 చేపట్టినట్లు ఆయన తెలిపారు. వరద ఉధృతి తగ్గే వరకు దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని చేపట్టే అవకాశం లేదని తెలిపారు.



నిమజ్జనానికి బయల్దేరిన దేవీ విగ్రహం



పేటలో ఊరేగింపులో మహిళల నృత్యాలు



కొల్లాపూర్‌లో అమ్మ వారి శోభాయాత్ర దృశ్యాలు

అలరించిన శోభాయాత్రలు

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా అమ్మవారి విగ్రహాల ఊరేగింపు
- డప్పు, మేళతాళాలతో నిమజ్జనానికి తీసుకెళ్లిన భక్తులు
- సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ

డప్పుల దరువులు.. గిరిజన నృత్యాలు.. చిన్న, పెద్ద తేడా లేకుండా మహిళలు సైతం ఆటపాటలతో అలరించారు. వీరి ఉత్సాహంతో కొనసాగిన అమ్మ వారి శోభాయాత్రలు కనువిందు చేశాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9 రోజుల పాటు అమ్మ వారిని భక్తిశ్రద్ధలతో కొలిచిన భక్తులు చివరి రోజు శనివారం పట్టణ, గ్రామీణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. వేలాదిమంది భక్తుల మధ్య శోభాయాత్రలు కొనసాగాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ వేడుకలు చూపరులను కట్టిపడేశాయి.



ఆత్మకూరులో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అమ్మ వారి ఊరేగింపులో మహిళల నృత్యం

కొల్లాపూర్/ కొత్తకోట/ నారాయణపేట రూరల్/ మరికల్/ఆత్మకూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ పట్టణంలోని వరిదేల శమీ వృక్షం వద్ద ఏర్పాటు చేసిన అమ్మ వారం మండపంలో శనివారం ఘనంగా కుటుంబ సమేతంగా చండీయాగం నిర్వహించారు. రాత్రి బాణసంచాల మధ్య అమ్మ వారి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. వరిదేల శమీ వృక్ష అభివృద్ధి కమిటీ సభ్యులు కొల్లాపూర్ పట్టణంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు అమ్మ వారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● కొత్తకోట మండలంలో దేవీ విగ్రహాలను భక్తులు నిమజ్జనానికి తీసుకెళ్లారు. కనిమెట్ట, పాలెం, పామాపురం, రామకృష్ణాపూర్, అప్పరాల, పట్టణంలో కోదండ రామస్వామి దేవాలయం, పాత కొత్తకోట, పాత కాలేజీల వద్ద ఏర్పాటు చేసిన మండపాల్లో పూజలు నిర్వహించిన దేవీ విగ్రహాలను పూలతో అలంకరించిన ట్రాక్టర్లపై దేవీ విగ్రహాలను ఉంచి భక్తులు ర్యాలీ నిర్వహించారు.

● నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ ఈశ్వర్ మందిర్‌లో దుర్గామాత నిమజ్జన వేడుకలు డాక్టర్ రాజ్ కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. శోభాయాత్ర కొనసాగింది. చండీ హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.

● మరికల్ మండల కేంద్రంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, కాళికాదేవి ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలో వీరశైవలింగాయత్ సంఘం ఆధ్వర్యంలో నిమజ్జన శోభయాత్ర వైభవంగా కొనసాగించారు. సాంప్రదాయంగా గంగమ్మ ఒడికి సాగనంపారు.

● ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని విశ్వ బ్రాహ్మణ, ఆర్యవైశ్య సంఘం, బాలబ్రహ్మేశ్వర స్వామి వెంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలలో కొలువైన అమ్మవారిని నిమజ్జన వేడుకలకు తరలించారు. ఆత్మకూరు పట్టణ పుర వీధుల గుండా అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు.



మరికల్‌లో ఆకట్టుకున్న కోలాటం

ఇంటర్వ్యూ..

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

» ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు



మిడ్జిల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్ఐ శివ నాగేశ్వర్ నాయుడు అన్నారు. చోరీల నియంత్రణకు పోలీస్ శాఖ చర్యలు చేపడుతోందని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తే ఇవ్వాలన్నారు.

నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు?

ప్రతీ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. పాత నేరస్తులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతూ.. వారు కొత్త నేరాలకు పాల్పడకుండా చర్యలు చేపడుతున్నాం.

ఇప్పటి వరకు ఎన్ని కేసులు పరిష్కరించారు?

ప్రస్తుత సంవత్సరంలో 230 కేసులు నమోదు కాగా, కోర్టు పరిధిలో 40 కేసులు పరిష్కరించడం జరిగింది.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చేపట్టిన చర్యలు?

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే 50 కేసులు నమోదు చేశాం.

ప్రజలకు మీరిచ్చే సందేశం ఏంటి?

చోరీల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలి. చిన్న చిన్న పంచాయతీలుంటే నేరుగా పోలీసులను, మధ్య వర్తులను ఆశ్రయించి ఇబ్బందులకు గురికావొద్దు.

న్యూస్ బాక్స్..

రేపు ప్రజావాణి రద్దు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 6న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారులు ఈ విషయం గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మార్కెట్‌లో కొనసాగిన ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల రైతులు సాగు చేసిన ధాన్యం విక్రయించేందుకు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. శనివారం మార్కెట్‌కు 9 క్వింటాళ్ల పెద్ద హంస రాగా, జరిగిన టెండర్ లావాదేవీల్లో క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.1,719, కనిష్ఠంగా రూ.1,710 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

సత్యనారాయణరెడ్డి మృతి తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిలకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వింజమూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణరెడ్డి అకాల మృతి పార్టీకి తీరని లోటని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వింజమూరులో గుండెపోటుతో మృతి చెందగా, మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, నాయకులు కృష్ణయ్య, రవి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్ నుంచి నీటి విడుదల



ఒక గేటు ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

దేవరకద్ర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు నీటి పారుదల శాఖ ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. శనివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 32.3 అడుగుల వద్ద నీటితో కళకళలాడుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో ప్రాజెక్టు పరిధిలోని భూగర్భ జలాలు పెరగడంతో ఆయకట్టు దారులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులకు బ్యాగుల వితరణ

గండీడ్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల అభ్యున్నతికి ఎల్లప్పుడూ పాటు పడతానని ఆ సంఘం మండల అధ్యక్షుడు గుముడాల చెన్నయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో తన దగ్గర పనిచేసే కార్మికులుకు టిఫిన్ బాక్స్, బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మండలంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని, గ్రామీణ ప్రాంతాల్లోని లేబర్‌కు లేబర్ పథకాల గురించి అవగాహన కల్పిస్తానని అన్నారు.

రిజర్వేషన్లలో గందరగోళం

» 99 శాతం ఎస్టీ ఉన్న గ్రామానికి బీసీకి కేటాయింపు

» పునః పరిశీలించాలని కలెక్టర్‌కు వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు (ఫైల్)

కోయిలకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 18 ఎంపీటీసీ స్థానాలు, 44 సర్పంచ్ అభ్యర్థుల రిజర్వేషన్ ఎంపిక ప్రక్రియలో గందరగోళం నెలకొంది. రెండు రోజుల క్రితం అధికారులు రిజర్వేషన్ గెజిట్ విడుదల చేయడంతో గ్రామాల్లోని నాయకులకు ఊహించని విధంగా రిజర్వేషన్లు రావడంతో షాక్‌కు గురయ్యారు. తాము అనుకున్నట్లు రిజర్వేషన్ వస్తదని ఎదురు చూసిన నాయకులకు ప్రభుత్వం బీసీలకు అమలు చేస్తున్న 42శాతం రిజర్వేషన్ ప్రకారం విడుదల చేసిన రిజర్వేషన్ ప్రక్రియ సక్రమంగా లేదని నాయకులు వాపోతున్నారు. మండలంలోని పల్లుతండా గ్రామ పంచాయతీలో 99శాతం ఎస్టీలు ఉండగా ఒక శాతం ఉన్న బీసీలకు బీసీ మహిళ రిజర్వేషన్‌ను కేటాయిచడంపై తండావాసులు కలెక్టర్‌ను ఫిర్యాదు చేశారు. తఎంపీటీసీ, సర్పంచ్ రిజర్వేషన్లలో ఓపెన్ జనరల్ స్థానాలకు అన్యాయం జరిగిందని మండలంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు శనివారం ఎంపీడీవో ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని కొన్ని పంచాయతీల రిజర్వేషన్లలో కూడా మార్పు చేయాలని నాయకులు అధికారులకు వివరాల ఆధారంగా వినతులు అందిస్తున్నారు.

ఆశలు ఆవిరి..

గ్రామ సర్పంచ్‌గా పోటీలో నిలవాలనుకొనే వారి ఆశలు రిజర్వేషన్లతో ఆవిరి అయ్యావని కొందరు నాయకులు లోలోపల కుమిలి పోతున్నారు. గత కొన్ని రోజులుగా ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాలు తెలుసుకున్న నాయకులు అధికారులు విడుదల చేసిన రిజర్వేషన్‌తో కొందరు సంబురాలు చేసుకుంటుండగా, మరి కొందరు రిజర్వేషన్ మార్పుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఏదేమైనప్పటికీ రిజర్వేషన్లతో కొందరికి మోదం, మరి కొందరికి ఖేదంలా మారాయి.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు



మండలంలోని ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ప్రభుత్వం విడుదల చేసిన రిజర్వేషన్లు గ్రామంలోని జనాభా ప్రాతికంగా ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో ఎంపీటీసీ, సర్పంచ్‌లకు కేటాయించిన రిజర్వేషన్‌లో రెండో స్థానంలో ఉన్న వారికి కేటాయించాం. ఈ ప్రక్రియ అంతా జిల్లా అధికారుల సమక్షంలో జరిగింది.

- ఆనంద్, ఎంపీడీవో

కనుల పండువగా అమ్మవారి శోభాయాత్ర

» వేలంలో అమ్మవారి చీరలు దక్కించుకున్న మహిళలు » సాంప్రదాయ నృత్యాలు చేసిన చిన్నారులు



టీడీగుట్టలో నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న ఆనంద్ గౌడ్



మల్లాపూర్ గ్రామంలో అమ్మవారి ఊరేగింపు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం రాత్రి అమ్మవారి శోభాయాత్ర కనుల పండువగా సాగింది. బండ్లగేరి, వీరన్నపేట, బండమీదిపల్లిలోని బ్యాంకు కాలనీ, న్యూటౌన్ పరిధిలోని బాయమ్మతోటలో సాయంత్రం నుంచే మండపాల వద్ద అమ్మవారి లడ్డూ, చీరలను వేలం పాటలో దక్కించుకున్నారు. అనంతరం నిర్వహించిన శోభాయాత్ర కాలనీల పరిధిలోని వీధుల్లో ఘనంగా నిర్వహించారు. యాత్ర ముందు కోలాటాలు, భజనలు, బతుకమ్మలు, సాంప్రదాయ నృత్యాలు నిర్వహించారు. పట్టణంలోని టీడీగుట్ట, బీకేరెడ్డి కాలనీలో నిర్వహించిన అమ్మవారి శోభాయాత్రలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు పట్టణ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. పలు కాలనీల యువజన, మహిళా బృందం సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి విగ్రహం ముందు నృత్యం చేస్తున్న చిన్నారులు



బండమీదిపల్లిలో అమ్మవారి ఊరేగింపు

● మిడ్జిల్ : మండలంలోని మల్లాపూర్, వెలుగొమ్ముల, వాడియాల గ్రామాలలోని నవరాత్రి వేడకల సందర్భంగా ఆయా గ్రామాల్లో కొలువు దీరిన దుర్గామాత అమ్మవారి విగ్రహాలను ఊరేగింపు నిర్వహంచారు. ఈ సందర్భంగా కలశాలు, చీరలు, ముక్కు పుడుకులను వేలం నిర్వహించారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందాం

» కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఆల ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన నియోజవర్గంలోని అన్ని మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలందరు కలిసి కట్టుగా పనిచేసి బరిలో ఉన్న పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలన్నారు. అదే విధంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల 420 అబద్ధాలను ప్రజలకు అర్థం అయ్యే విధంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి గెద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై గల్లీ నుంచి రాష్ట్ర అధిష్ఠానానికి అర్థం అయ్యే విధంగా ప్రతీ కార్యకర్త నిలదీయాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం మొత్తం అప్పుల పాలై పోయిందని, మేము అధికారంలోకి వస్తే మార్పు తెస్తామని చెప్పి సామాన్య ప్రజలను రైతులను రోడ్డు పాలు చేశారని మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భూత్పూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ బస్వరాజుగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, హైకోర్టు అడ్వకేటు, పార్టీ నాయకుడు సరోజ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ వార్డు కౌన్సిలర్ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మూసాపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై వెలిసిన అతి పురాతన కాలం నాటి రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు, యువకులు ప్రత్యేక అభిషేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండుగ సందర్భంగా పట్టణల్లో ఉంటున్న తోటి మిత్రులు, యువకులు ఆలయానికి తరలివచ్చి పూజలు చేశారు. అయోధ్య వెళ్లేముందు శ్రీరాముడు ప్రతిష్టించిన కోటి లింగాల్లో చివరి లింగాన్ని ఎంతో సంకల్పంతో ఇక్కడే ప్రతిష్ఠించడంతో ఈ ఆలయానికి ఎంతో మహిమ ఉందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అక్కని నరేందర్ సాగర్, కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, రాకేష్, శంకర్ తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

నవాబ్‌పేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎంపీడీవో జయరాములు, ఎంఈవో నాగ్యనాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించి, మాట్లాడారు. పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చి దిద్దేందుకు అందరు కలిసి రావాలన్నారు. ప్రతీ విద్యార్థి శుభ్రత పాటించాలని లేకుంటే అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

వైద్యవృత్తి దేవుడిచ్చిన వరం



హర్షితను సన్మానిస్తున్న విశ్వకర్మ సేవా సమితి సభ్యులు

పాలమూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వైద్యవృత్తి దేవుడిచ్చిన గొప్పవరమని ఆచార్య జయశంకర్ విశ్వకర్మ సేవా సమితి వ్యవస్థాపకులు కె.బ్రహ్మయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో ధన్వాడ శ్రీనివాసులు, ధన్వాడ ప్రవీణ కూతురు ధన్వాడ హర్షిత రాష్ట్ర స్థాయిలో 60వ ర్యాంకు సాధించటంతో ఘనంగాసన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిలో మానవత్వంతో మెలగడమే కాకుండా నిరుపేదలకు సేవ చేసుకునే అవకాశం, వివిధ రకాల వ్యాధిగ్రస్తులకు పునఃర్జన్మను ప్రసాదించే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వృత్తిలో కొనసాగడం ఎంతో అదృష్టమన్నారు. కార్యక్రమంలో పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు రమేష్, ప్రముఖ న్యాయవాది వీరబ్రహ్మయ్య, గార్లపాడు బాబు, వడ్ల రాఘవాచారి పాల్గొన్నారు.

గెలిచే వారికే అవకాశం ఇద్దాం

నవాబ్‌పేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో గెలిచేవారికే అవకాశం ఇద్దామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీరటి రాంచంద్రయ్య అన్నారు. శనివారం మండలంలోని కారుకొండ, ఇప్పటూర్, యన్మనగండ్ల, పోమాల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పర్యటించి, మాట్లాడారు. పార్టీ సూచించిన వారి కోసం అందరు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ హరలింగం సలహా కమిటీ సభ్యులు తులసీరాం, భూపాల్ రెడ్డి, రఘువీర్ శర్మ, దేపల్లి వెంకటేష్‌గౌడ్, కూచూర్ సురేష్, జలాలోద్దీన్ బాబర్, హమీద్ మహేక్, ఖాలేద్ మహేక్, మార్కెట్ డైరెక్టర్ జమీరోద్దిన్, భాస్కర్, సత్యనారయణ, శేఖరయ్య, రియాజ్ పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

బాలానగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఎవరైనా వారి గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అడ్వైజర్ కమిటీ కన్వీనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బోడజానంపేట, నందారం, గుండేడ్ గ్రామాల్లో స్థానిక సంస్థల అభ్యర్థులపై కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపునకు తప్పనిసరిగా పని చేయాలన్నారు. వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అలయ్ బలయ్ వేడుకలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గడియారం చౌరస్తాలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు అలయ్ బలయ్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమతి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలను జిల్లాలో మొదటి సారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ కులమతాలకు అతీతంగా నిర్వహించే ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అన్ని పార్టీల నాయకులు, అన్ని మతాల పెద్దలు పాల్గొంటారన్నారు. ఈ వేడుకలకు పట్టణంలోని అన్ని ప్రాంతాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'చలో హైదరాబాద్'కు తరలిరావాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల హైయ్యర్ పెన్షన్ సమస్యల పరిష్కారానికి సోమవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తరలిరావాలని ఆ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు, ఉపాధ్యక్షుడు జీబీ పాల్, భగవంతు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఫోరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పీఎఫ్ కార్యాలయం నుంచి వచ్చిన డిమాండ్ లేఖలపై అనేక మంది విశ్రాంత ఉద్యోగులు గత సంవత్సరం క్రితం నుంచి హైయ్యర్ పెన్షన్ మంజూరుకై లక్షలాది రూపాయలు డీడీల రూపంలో చెల్లించినా ఇంతవరకు పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. అనేక మంది విశ్రాంత ఉద్యోగులకు ఇంత వరకు డిమాండ్ లేఖలను కూడా పంపలేదని, ఇంకొందరికి హైయ్యర్ పెన్షన్ ఎరియర్స్ చెల్లించలేదని వారు ఆక్షేపించారు. పెన్షనర్ల సమస్యల పట్ల కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం అధికారులు పూర్తి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నారాయణ, నాగాంజనేయులు, అంజన్న, బొక్కా నర్సింహులు, బీహెచ్.కుమార్, సలీం, రియాజోద్దీన్, డేవిడ్, లలితమ్మ, చక్రధర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళాభవన్‌కు గిరిజన సంఘం మద్దతు

పాలమూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాభవన్ సంరక్షణకు గిరిజన సేవా సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మణ్‌నాయక్ ప్రకటించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఏ ఒక్క కులం, ఒక పార్టీకో చెందిన వ్యక్తి కాదన్నారు. అంబేడ్కర్ పేరు కాదు భావితరాలకు భవిష్యత్తు, అణగారిన వర్గాలకు చేయూత ఆయన పేరు మీద ఉన్న భవనం బహుజన జాతికి భరోసా అన్నారు. అయన పేరుమీద నిర్మించిన అంబేడ్కర్ కళా భవన్‌లో ఉర్దూఘర్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చి కళా భవనాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. మైనార్టీలకు ఉర్దూఘర్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదన్నారు. ఉర్దూఘర్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు, వక్ఫ్ భూములు అనేకం ఉన్నాయని, ఆ స్థలాల్లో నిర్మాణం చేసుకోవాలని సూచించారు. కానీ అంబేడ్కర్ పేరు మీద కట్టిన కళా భవన్‌లో నిర్మాణం చేస్తామంటే ఊరుకోమన్నారు.

ఘనంగా వెన్న ఈశ్వరప్ప జన్మదినం



బీజేపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వెన్న ఈశ్వరప్ప

గండీడ్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వికారాబాద్ జిల్లా జీఎస్టీ ప్రచార కమిటీ కన్వీనర్, సేవారత్న అవార్డు గ్రహీత, సంఘ సేవకుడు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప జన్మదిన వేడుకలు శనివారం గండీడ్, మహమ్మదాబాద్ మండల కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో అభిమానులు, కార్యకర్తల నడుమ కేక్ కట్ చేయగా, సీనియర్ నాయకులు గిరెమోని శ్రీనివాస్, ఏవీ రాములు, కొమిరె లక్ష్మయ్య, బద్రీశ్వర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

క్రీడల శారీరక ధారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప అన్నారు. శనివారం గండీడ్ మండలం జిన్నారం తండాలో విజయ దశమి ఉత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ పోటీలో చెల్లాపూర్ మొదటి బహుమతి రూ.15,000, ద్వితీయ బహుమతి జిన్నారం తండా రూ.10,000 నగదు అందజేశారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి




మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు పాండురంగారెడ్డి అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాయలంలో మహబూబ్‌నగర్ గ్రామీణ మండల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఎంపీటీసీ, సర్పంచ్‌లకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను సేకరించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా అందరిని కలుపుకొని ముందుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థి కీలకమని, అందరి సమన్వయంతో అభ్యర్థులను ఎంపిక చేయాల్సిన అవసం ఉందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బొంగు గంగన్న, నాయకులు కోడూరు రాజుగౌడ్, మీడియా సెల్ కన్వీనర్ కే.సతీష్‌కుమార్, జిల్లా కార్యదర్శి తాటి వెంకటటేశ్వరమ్మ, నాయకులు మహేష్‌గౌడ్, శ్రీనివాసులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ

భూత్పూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రంలో ముస్లిం సోదరులు శనివారం ఘనంగా గ్యార్వీ జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహ్మద్ అలీ ఫాతిమా కమ్యూనిటీ భవనంలో ముస్లిం మత పెద్దలు, మైనార్టీ యువకులు శనివారం రాత్రి జగనేకే రాత్ చేపట్టి, ఆదివారం మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం చేశారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేసిన సత్యసాయి సేవా సమితి సభ్యులు

జడ్చర్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా జడ్చర్ల సాయిమందిరంలో శనివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయి మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ, నర్సిములు, రమాకాంత్, శారద, కవత పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి భూమి పూజ



జడ్చర్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కరిణి శుద్ధితో పాటు పునఃనిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు సుధీంద్ర చారి వేదమంత్రోచ్ఛరణలతో కాంగ్రెస్ నాయకులు పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుక్క వెంకటేశం, స్థానికులు వెంకటరమణ, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పూజ చేస్తున్న నాయకులు